# చీకటి లోపల వెలుగు

చేతిలోవున్న నవలలో యింకా మిగిలున్న పేజీలు చదవగలగడం కంటే ఆత్మహత్య చేసుకోవడం సులభమనిపించి ప్రక్కన పడేసింది సుశీల. బద్ధకంగా ఆవులించి భర్త వస్తున్నాడేమోనని రోడ్డువైపు చూసింది. తన హృదయాన్ని చుట్టేస్తున్న నిరాశలా చిక్కగావున్న చీకటిని చూసి నిట్టూర్చింది.

నాలుగు వాటాలున్న యింట్లో వున్నా ఒంటరితనం తననింతగా బాధించకపోను. పెళ్ళయిన ప్రతి యిల్లాలు యే మధురమైన చాకిరి చేసి చేసి అలిసిపోతుందో దానికి నోచుకోలేదు తను.... అదీ.... స్వయంకృతాపరాధంవల్ల.

గతం వెక్కిరిస్తూ సుశీల ముందు నిలబడింది. భయంకరమైన స్వప్నాన్ని కంటున్నట్లు సుశీల ముఖం విహ్వలంగా వుంది.

*　　*　　*　　*

భవిష్యత్తుమీద అపారమైన ఆశతో, దాంపత్యజీవితంమీద ఎన్నో మధురోహల్ని పేర్చుకుంటూ శేఖర్ జీవితంలోకి అడుగుపెట్టింది సుశీల. శేఖర్ ఎమ్. ఏ. పాసయి యివాళో, రేపో మంచి ఉద్యోగాన్ని సంపాదించుకోగలననే నమ్మకంతో వున్నాడు.

తను పెద్ద భ్రమలో వున్నానని శేఖర్ కొద్దిరోజుల్లోనే తెలుసుకున్నాడు. ఉద్యోగం దొరకలేదనే నిస్పృహతో శేఖర్ క్రుంగిపోతూ వుండగా సుశీల కడుపు పండింది. యింత మంచి వార్త విని ఎంతో గర్వాన్ని, ఆనందాన్ని పొందాల్సిన శేఖర్ మరింత క్రుంగిపోయాడు. ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడలేని సమయంలో, భార్యను

పావలా పూలు తేవాలన్నా అమ్మ నడగాల్సిన స్థితిలో వున్న తను బిడ్డ తండ్రి కావడమా!.... తనవాళ్ళకి, తన భార్య తరపువాళ్ళకి తామే భారంగా వున్నారు, యింక తమ బిడ్డలు కూడా....నో....వీల్లేదు. తనకి ఉద్యోగం వచ్చేదాక బిడ్డ పుట్టడానికి వీల్లేదు....అసహనంగా చలించాయి శేఖర్ కళ్ళు.

"అదేంటండీ అలా అంటారు?అసలలా అనడానికి మీ మనసెలా ఒప్పింది?తొలిసారి బిడ్డను పొందుతున్నామన్న భావం ఎంత సంతోషాన్ని కలిగించాలి? ఎబార్షన్ చేయిస్తా ననడానికి మీకు సెంటిమెంట్ అడ్డు రావడం లేదా?" దీనంగా అడిగింది సుశీల. సుశీల మాటలు విన్నాక తను తప్పు ధోరణిలో ఆలోచిస్తున్నానేమోనన్న భావం ఒక క్షణం కలిగినా మరుక్షణం దాన్ని అణిచేశాడు శేఖర్.

"నీ మొహం. సెంటిమెంట్స్‌ని పట్టుకుకూర్చుంటే అవి తిన్నగా ఊబిలోకి లాగుతాయి. మనమే ఒకరికి భారంగా వున్నాం పిల్లల్ని కని వాళ్ళ భారాన్ని కూడా ఇతరుల్ని మొయ్యమనడం తప్పు."ఒక కోణం లోంచి చూస్తే అతని మాటలు నిజమే ననిపించినా గర్భస్రావం చేయించుకోవడమనే ఊహే సుశీల మీద సమ్మెటపోటులా తగల సాగింది.

"ఆ మాత్రం జ్ఞానం మనకు ముందే వుండి జాగ్రత్తపడితే బాపుండేది" కడుపులో మంటని ఆపుకోలేక రోషంగా అంది సుశీల.

"జ్ఞానమున్నదానివి నువ్వు చూడకపోయావా ఆ ఉపాయమేమిటో" వ్యంగ్యంగా చూశాడు శేఖర్.

"నా జ్ఞానం, ఉపాయాలు ఏపాటివి? యిదిగో యిప్పుడు మీరు చెప్తున్నారుగా గొప్ప ఉపాయాలు!" వెక్కిరింపుగా అంది సుశీల. మరు

క్షణం తనెంత తెలివి తక్కువగా అతనితో వాగ్యుద్ధానికి దిగుతూందో గ్రహించింది సుశీల. నచ్చచెప్పో, బ్రతిమాలో, బామాలో తనలో ఊపిరిపోసుకుంటున్న తన శిశువును బ్రతికించుకోవడం తనకు ముఖ్యం. పోట్లాటవల్ల పరిస్థితి మరింత అధ్వాన్నమవుతుందే తప్ప ఫలితం వుండదు. ఆవేశాన్ని అణుచుకుంది సుశీల.

"సారీ.దురుసుగా మాట్లాడాను.కాని.... ఎబార్షన్ చేయించుకోవడం యిష్టం లేదు నాకు. మన ప్రేమఫలం, మన తొలి బిడ్డని మనం పొంది తీరాలి. నా కోరికను అర్థం చేసుకుని మీ ఆలోచనని విడిచిపెట్టండి" అను నయంగా చూసింది సుశీల.

"ఏదో కొంప మునుగిపోతున్నట్టు ఆర్భాటం చేస్తావేమిటి సుశీ! అసలు పిల్లలే వద్దంటున్నట్లు హడిలిపోతావేమిటి? కొన్నాళ్ళు పోయాక, మనం ఆర్థికంగా నిలదొక్కుకున్నాక నీకు కావలసినంతమంది పిల్లల్ని కందువు గాని, సరేనా?" నవ్వుతో హాస్యం చేసి తేల్చేయాలని చూశాడు శేఖర్. కాని సుశీల తన పట్టు విడవలేదు. చెప్పి, చెప్పి చిరాకెత్తుకొచ్చింది శేఖర్‌కి.

"ఇంజక్షన్ చేయించుకున్నంత ఈజీగా ఎబార్షన్ చేయించుకుంటు న్నారీ రోజుల్లో. నువ్వు మాత్రం నీ మూర్ఖపు పట్టుదలని విడిచిపెట్టడం లేదు. యిక నువ్వు చెప్పేదీ, నేను వినేదీ ఏమీ లేదు. రేప్పొద్దున మనం లేడీ డాక్టర్ దగ్గరకు వెళ్తున్నాం. రేపే నువ్వు ఎబార్షన్ చేయించేసుకుం టావు." కటువుగా చెప్పి అక్కడినుంచి చరచరా వెళ్ళిపోయాడు. నిర్ఘాంత పోయి చూసింది సుశీల.

అత్తమామలకైనా చెప్పుకుందామంటే తమ యిద్దరికి తప్ప మూడో వ్యక్తికి విషయం తెలిస్తే వూరుకోనని అల్టిమేటమ్ యిచ్చాడు శేఖర్. మర్నాడు ఉదయం శేఖర్ వెంట నర్సింగ్ హోమ్‌కి వెళ్ళక

తప్పలేదు సుశీలకి. డాక్టర్‌తో శేఖర్ మాట్లాడాడు. మౌనంగా తల వంచుకు కూర్చున్న సుశీల డాక్టరమ్మ అడిగిన ప్రశ్నలకు యంత్రం చేసినట్లు జవాబిచ్చింది.

"ఒకసారామెను పరీక్షచేశాక ఏ విషయం చెప్తాను" అని శేఖర్‌తో చెప్పి సుశీలను పరీక్ష చేసే గదిలోకి తీసుకెళ్ళింది డాక్టర్ జానకి.

"చూడమ్మా! నీకిష్టం లేకుండా ఆపరేషన్ చెయ్యను. ఇద్దరో, ముగ్గురో కావలిసిన పిల్లలు పుట్టేశాక మరి వద్దనుకుంటే ఎబార్షన్ చెయ్యడానికి పెద్ద అభ్యంతర పెట్టను. కాని మొదటిసారి చెయ్యడాన్ని నేనూ వ్యతిరేకిస్తాను. భార్యాభర్తలిరువురూ ఆలోచించుకుని గట్టిగా నిర్ణయం చేసుకుని వచ్చినా మళ్ళీ ఒకసారి ఆలోచించుకోమని చెప్పి, నచ్చజెప్పి, సాధ్యమైనంతవరకు వాళ్ళ ఆలోచన విడిచి పెట్టేలా చేస్తాను. అంచేత నువ్వు గాభరాపడకుండా నీ మనసులో దేమిటో చెప్పు" జానకి మాటలతో కన్నీళ్ళుబికి వచ్చాయి సుశీలకి.

"డాక్టరుగారూ! దురదృష్టవశాత్తు వస్తుందనుకున్న ఉద్యోగం రాలేదు. యివాళ కాకపోతే రేపైనా రాకపోతుందా? ఉద్యోగం లేకపోతే మేం బ్రతకడంలేదా? అలాగే నా బిడ్డా బ్రతుకుతాడు. ఉద్యోగం లేదని ఏది మానుకున్నాం? పెళ్ళి మానుకున్నామా? సంసారం మానుకున్నామా? గర్భం రాకుండా చూసుకుంటే ఆ దారి వేరు, వచ్చాక తీసేయించు కోవడం దారుణం కాదూ? హాయిగా పెళ్ళి చేసుకుని, కాపురం చేసుకుంటున్న నాకంత అగత్యమేమొచ్చింది?" సుశీల ప్రశ్నల్ని వింటూంది జానకి. డబ్బు, పరిస్థితులు మనిషి జీవన విధానంమీద, ఆలోచనా రీతుల మీద ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయో ప్రతి వ్యక్తి జీవితాన్ని చదువుతున్నప్పుడూ అర్థమవుతూనే వున్నా. ఎప్పటి కప్పుడు వింతగానే

వుంటుంది జానకికి. సుశీలకి ధైర్యం చెప్పి శేఖర్ దగ్గరకు వచ్చింది జానకి. "మీ లాంటి విద్యావంతులకి నేను క్రొత్తగా చెప్పేదేం లేదు కాని.... ఒక హెచ్చరికమాత్రం మీకు చెయ్యక తప్పదు. మేమెంత జాగ్రత్తగా ఎబార్షన్ చేసినప్పటికీ కొంత రిస్కు వుంటుంది. ఇన్ఫెక్షన్ వచ్చి అండవాహికలు మూసుకుపోయే అవకాశం వుంది. అంటే ఆ స్త్రీ దాదాపుగా శాశ్వతంగా మాతృత్వాన్ని కోల్పోయే ప్రమాదముంది. యింత రిస్కుకి సిద్ధపడాల్సిన అవసరమేముంది మీకు?" శేఖర్ వంక నిశితంగా చూసింది జానకి. 'యీ డాక్టర్ కూడా ఒక సెంటిమెంటల్ ఫూల్‌లా వుంది. లేకపోతే, పేషెంటుకి నచ్చ జెప్పి తన పనేదో ముగించి తన డబ్బు తను తీసుకోక లేనిపోనివన్నీ చెప్పి పేషెంట్‌ని బెదరకొడ్తుందేమిటి?-' చిరాగ్గా వుంది శేఖర్‌కి.

"అసలు పేషెంట్ ఒప్పుకోకుండా బలవంతంగా చెయ్యను నేను" శేఖర్‌కి నచ్చజెప్పడానికి ప్రయత్నించి విసిగిపోయిన జానకి యిదే ఆఖరు మాటన్నట్లు లేచింది.

కాని అలా చెయ్యడానికి నిరాకరించి తనెంత పొరపాటు చేసిందో విపరీతమైన కడుపు నొప్పితో, జ్వరంతో తన దగ్గరి కొచ్చిన సుశీలను చూశాకగానీ తెలియలేదు జానకికి. కదిలి కదిలి ఏడుస్తూ సుశీల చెప్పిన విషయం విన్నాక చేతులారా తనే సుశీలను అనుభవంలేని నర్సు చేతిలో పెట్టినట్లు బాధపడింది జానకి. సుశీల యింతటి శారీరక, మానసిక వేదన ననుభవించడానికి కారణం నిజంగా ఆర్థిక అసహాయతా, లేక శేఖర్ అవివేకమూ, అహంకారమూ, మొండి పట్టుదలానా అనిపించింది.

ఆరోగ్యాన్ని చక్కబరచుకుని యింటికి వెళ్ళింది సుశీల. తరువాత కొద్ది నెలల్లో శేఖర్‌కి ఉద్యోగమొచ్చింది. తమ బ్రతుకు తాము బ్రతక

గలమని నమ్మకం కుదిరాక సుశీల హృదయం పిల్లల కోసం ఆరాటపడ సాగింది. టాబ్లెట్స్ మానేసి సంవత్సరమైనా గర్భం రాకపోయేసరికి ఆందోళనగా వుంది. డాక్టర్ జానకిని సంప్రదించడానికి భర్తతో కలిసి వెళ్ళింది.

సుశీలకీ, శేఖర్‌కీ పరీక్షలన్నీ చేయించింది జానకి. చెప్పడానికి బాధగా వున్నా నిజం చెప్పక తప్పలేదు. 'హిస్టిరో సాల్పింగోగ్రఫీ' లో గర్భాశయం మాత్రమే కనిపిస్తుంది. గర్భాశయాని కిరువైపులా వున్న అండవాహికలు మూసుకుపోయాయి. సుశీల అరికట్టుకోలేని వ్యథతో తన మీద ప్రశ్నల పరంపరని కురిపిస్తూంటే కొంచెం వివరంగా చెప్పింది జానకి.

"అండవాహిక బయటివైపు నుంచి అండము, గర్భాశయంవైపు నుంచి పురుషుడి వీర్యంలోని స్పెర్మ్ ప్రయాణించి అండవాహిక లోనే రెండూ కలుస్తాయి. అలా ఫలించిన కొత్త జీవకణం పరమాద్భుతంగా తనలాంటి ఎన్నో కణాలుగా విభజింపబడుతూ అండవాహిక నిర్మాణ ప్రత్యేకత వల్ల దాని ప్రత్యేకమైన కదలికవల్ల, అండవాహిక నుంచి గర్భాశయాన్ని చేరి అక్కడ నవమాసాలు పెరుగుతుంది. అండవాహికలు మూసుకుపోతేగాని, వాటి సున్నితమైన కండరాలు దెబ్బ తిని కదలికలు లేకపోతేగాని, వాటిలోని సహజ రసాయన వాతావరణం లేకపోతేగాని అండము, స్పెర్మ్ కలిసే అవకాశం లేదు" సుశీల కళ్ళల్లోకి చూసే ధైర్యం లేక శేఖర్ మౌనంగా తల వంచుకుని వింటున్నాడు. హృదయపు అట్టడుగు పొరల్నుండి బాధ ఎగసిపడుతూంటే నిగ్రహించు కోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"డాక్టరుగారూ! ఇప్పుడేం చెయ్యాలో చెప్పండి. ఎంత పెద్ద ఆపరేషన్కైనా నేను సిద్ధమే. తల తాకట్టు పెట్టయినా అందుకు కావల్సిన డబ్బు తెచ్చుకుంటాము" జీవంలేని సుశీల ముఖం వంక జాలిగా చూసింది జానకి. ఒకనాడు డబ్బు లేదనే ఆలోచనలతో గర్భం తీసేయించుకోవలసి వచ్చింది. యీ రోజు గర్భం కోసం తల తాకట్టుపెట్టయినా డబ్బు తెచ్చుకుంటానంటూంది.

"ఏం చెప్పి నిన్ను ఓదార్చాలో నాకు తెలియడం లేదమ్మా!.... కాని.... బొంబాయిలో డాక్టర్స్ని సంప్రదించితే, ఏమైనా ప్రయత్నం చేస్తారేమో!" అంత వరకే చెప్పింది కాని 'వెళ్ళి వైద్యం చేయించుకో' అని భరోసాగా చెప్పలేక పోయింది జానకి. బొంబాయిలో వైద్యం ఎంత ఖరీదైన వ్యవహారమో తెలుసు. కేవలం సుశీలలోని ఆశను పూర్తిగా చంపలేక బొంబాయి ప్రస్తావన తెచ్చింది కాని ఫలితం దాదాపుగా ఏమీ ఉండదని తెలుసు.

జానకి ఏ వుద్దేశ్యంతో చెప్పినా, సుశీల మాత్రం బొంబాయి వెళ్ళి తను చెయ్యగల ప్రయత్నం చేసింది. అక్కడి డాక్టర్లు కూడా చెప్పింది విన్నాక ఏ విధంగానూ తన దురదృష్టాన్ని సరిచేసుకోలేనని తెలిసింది సుశీలకి. డబ్బుమీద, భర్త మీద, చుట్టూ వున్న మనుష్యుల మీద, సమస్త ప్రపంచం మీద కసిని పెంచుకుని హిస్టీరికల్గా ప్రవర్తించే సుశీల కాస్త కుదుటపడడానికి ఎన్నో నెలలు పట్టింది. అంధకారంలో నిలబడిపోయిన సుశీల ఏ కొంచెం వెలుగయినా కనిపిస్తుందేమోనని ఎదురు చూస్తూవుంది.

ఈదురుగాలికి కిటికీ తలుపులు టపటప కొట్టుకోవడంతో ఆలో చనల్నుండి బయట పడింది సుశీల కిటికీలోగుండా రోడ్వైపుకు చూసి విసుగ్గా పేపర్ చేతిలోకి తీసుకుంది. యధాలాపంగా పేపర్ చూస్తున్న సుశీల దృష్టి ఒక దగ్గర ఆగిపోయింది. కళ్ళు విప్పార్చుకుని, విపరీత మైన వేగంతో చలిస్తున్న హృదయాన్నదుపుగో పెట్టుకుంటూ గబగబ చదివింది. సుశీల కళ్ళల్లో కోటి ఆశా కుసుమాలు వికశించాయి. సుశీల హృదయ తంతువులు ఉద్వేగంతో ప్రకంపించాయి. సుశీల మెదడులోని ప్రతి కణము ఊహల విద్యుత్తును సృష్టిస్తూంది.

సుశీల కళ్ళముందు ఒక వెలుగు కిరణం మెరిసింది. సుశీల గర్భంలో ఒక చంద్రవంక పెరిగి ఆమె పొట్టని చీల్చుకుని బయటికి వచ్చింది. ఒక మహాద్భుతం జరిగి ఈ జన్మకిక బిడ్డలే కలుగరనుకున్న సుశీలకు ఒక చిలిపి కృష్ణుడు పుట్టాడు. సుశీల బ్రతుకులో బోసి నవ్వుల్తో వెన్నెలను నింపుతున్నాడు. స్థంబించి పోయిన సుశీల బ్రతుకులో కళ్ళూ, కాళ్ళూ కదుపుతూ చైతన్యం తీసుకు వచ్చాడు. సుశీలలో ఉద్భవిస్తున్న ఆశల్నీ, కోరికల్నీ ఆమె చిన్ని హృదయం యిముడ్చుకోలేక పోతూంది. తన కలలపంట కలెక్టరవుతాడా, ఇంజనీరవుతాడా, సైంటిస్ట్ అవుతాడా లేక...లేక తనలాంటి అభాగ్య మాతృ హృదయాల్లో కాంతి నింపగల గొప్ప డాక్టరవుతాడా?.... బాబుని హృదయానికి హత్తుకుని, మృదువుగా వున్న బాబు శరీరాన్ని నిమురుతూ తన్మయత్వాన్ననుభవిస్తూంది సుశీల.

"సుశీ!" భర్త పిలుపు మెల్లగా వినిపిస్తూంది.

"ఓ! మీరు వచ్చేశారా?! బాబు నెత్తు కోండి. మీకు స్నానానికి నీళ్లు పెట్టి వస్తాను" కళ్ళు అరమోడ్చి, పదిలంగా బిడ్డ నందించబోతు న్నట్లున్న సుశీల రిక్తహస్తాల వంక షాక్ తిన్నట్లు చూశాడు శేఖర్.

"సుశీ!" సుశీల భుజం పట్టి కుదిపాడు శేఖర్. ఉలిక్కిపడి కళ్ళు విప్పి భర్త వంక అయోమయంగా చూసి తన చేతులవంక చూసుకుంది. జరిగిందేమిటో తెలుసుకున్న సుశీల జాబు భ్రమ నుంచి వాస్తవంలోకి అడుగు పెట్టలేక, వాస్తవాన్ని గుర్తించి తట్టుకోలేక అచేతనంగా నిలబడి పోయింది. ప్రపంచంలోని దీనత్వమంతా ఆమె ముఖంలో ప్రోగుపడి వుంది. ఒక నిమిషం నిశ్చలంగా చూస్తూ నిల్చున్న సుశీల అగ్ని పర్వతం బ్రద్దలైనట్లు వెక్కి వెక్కి ఏడుస్తూ పేపర్ శేఖర్ మీదికి విసిరి కొట్టి లోపలికి పరుగెత్తింది.

పేపరు వంక చూసిన శేఖర్ దృష్టి 'టెస్ట్‌ట్యూబ్‌బేబీ' దగ్గర ఆగి పోయింది, యిది సంభవమా?నిజంగా సైన్స్ యింత అభివృద్ధిని సాధించిందా?! సుశీలకులా అండవాహికలు మూసుకుపోయినా, సక్రమంగా పనిచెయ్యకపోయినా యిదివరకులా నిస్సంతుగా, నిస్సారంగా జీవితాన్ని గడపనక్కర్లేదు. స్త్రీ అండాన్ని ఆపరేషన్‌తో వెలికిదీసి టెస్ట్‌ట్యూబ్‌లో స్పెర్మ్‌తో ఫలదీకరణచేసి దానిని గర్భకోశంలో ప్రవేశపెట్టారు. అప్పటి వరకూ యింజెక్షన్‌ద్వారా పిండం పెరిగేందుకు అనువైన వాతావరణం గర్భకోశంలో సృష్టించి, నవమాసాలూ పిండం సక్రమంగా పెరిగేలా ఇంజెక్షన్స్ చేశారు. పిండం పూర్తిగా పెరిగాక సిజేరియన్ ఆపరేషన్‌చేసి శిశువుని వెలికి దీసి వైద్య రంగంలో, వైజ్ఞానిక రంగంలో చరిత్రను సృష్టించారు. అపూర్వమైన యీ ప్రయోగం సైన్సు సాధించిన గొప్ప విజయం. యిలాంటి శిశు జననాలు యీ ప్రారంభదశలో ఎంతో కష్ట తరంగా, విచిత్రంగా కనిపించినప్పటికీ యీ శిశువు మానసిక శారీరక ఆరోగ్యం యెలా వుండేదీ వేచి చూడాల్సిన విషయమే అయినా, విజ్ఞాన రంగం పూర్తి సత్ఫలితాన్ని సాధిస్తుందనే ఆశాభావం ఉదయించింది శేఖర్‌లో. ఈనాడు ఎక్కడో వికసించిన వింత పువ్వు రేపు తన యింట్లో పరిమళించే అవకాశం ఉందనే విశ్వాసంతో ఆ విశ్వాసాన్ని సుశీల హృదయంలో కూడా నింపాలనే ఆరాటంతో లోపలి కెళ్ళాడు శేఖర్.